ఆయకట్టుకు సాగునీరు చేరేదెలా?

- వేధిస్తున్న లస్కర్ల కొరత
- అస్తవ్యస్తంగా బీటీపీ సాగునీటి నిర్వహణ
- ప్రైవేటు వ్యక్తులే దిక్కు
- చివరి ఆయకట్టుకు సక్రమంగా చేరని సాగునీరు
- ఆందోళనలో రైతులు



ఎడమ కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు

రాయదుర్గం: బీటీపీ ఆయకట్టుకు సాగునీరు వదిలి సుమారు 20 రోజులైంది. ఈ క్రమంలో పంటల సాగు కోసం అన్నదాతలు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. కాలువల్లో నీటి పంపిణీ, పిల్ల కాలువల నిర్వహణలో జాప్యం తదితర కారణాలు వెరసి సాగునీరు వృథా అవుతోంది. దీంతో చివరి (టెయిలెండ్) ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ సమస్యల పరిష్కరించేందుకు గతంలో ఇరిగేషన్ శాఖలో లస్కర్లు (మ్యాన్ మజ్దూర్) ఉండేవారు. క్షేత్రస్థాయిలో వీరి పర్యవేక్షణ కీలకంగా ఉండేది. ప్రస్తుతం వీరి నియామకాలు జరపడం లేదు. అరకొరగా ఉండేవారు సైతం పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో 17 మంది లస్కర్లు ఉండాల్సిన చోట ఒక్కరుంటే ఒట్టు. దీంతో నీటి వినియోగంపై సిగపట్లు మొదలైంది. నాకు నీకంటూ ముష్టియుద్ధాలకు దిగుతున్నారు. సాగు ఆరంభంలోనే ఇలా ఉంటే మును ముందు మరెన్నీ ఇబ్బందులు పడాల్సి వస్తోందోనని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రొటేషన్ పద్ధతిలో సాగునీరు..

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని బీటీపీ రిజర్వాయర్ ద్వారా ఆయకట్టుకు రొటేషన్ పద్ధతిలో సాగునీరు విడుదలవుతోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని గుమ్మఘట్ట ప్రధాన (ఎడమ) కాలువ పరిధిలో 8,400 ఎకరాలు, బ్రహ్మసముద్రం మండలంలోని ప్రధాన(కుడి) కాలువ పరిధిలో 4 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. రొటేషన్ పద్ధతిలో 2025 రబీ సాగు కోసం గతేడాది డిసెంబర్ 28న సాగునీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. ఎడమ కాలు లో 15, 16, ఏ, బీ, సీ, 17 వ డిస్ట్రిబ్యూటరీల పరిధిలో 2,806 ఎకరాలు, కుడి కాలువలో 1, 2, 3, 4, 5, 6, 6ఏ డిస్ట్రిబ్యూటరీల పరిధిలో 1,705 ఎకరాలకు సాగునీరు విడుదల చేశారు. కొంత మంది ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేసుకోగా, మరి కొందరు పిట్ట మళ్లు సిద్ధం చేస్తున్నారు. ఇంకొందరైతే పిల్లకాలువల చదునులోనే సరిపోయారు. రోజూ గుమ్మఘట్ట కేపీ ట్యాంకు నుంచి ఎడమ కాలవ ద్వారా 36 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 23 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఏప్రిల్ ఆఖరు వరకూ సాగునీరు విడుదల చేయనున్నారు.

1500 ఎకరాలకు ఒక లస్కర్ ఉండాలి..

ఇరిగేషన్ లెక్కల ప్రకారం 1500 ఎకరాలకు ఒక లస్కర్, ప్రాజెక్టు గేట్లు ఇతర అవసరాలు కలుపుకుని రిజర్వాయర్ పరిధిలో మొత్తం 17 మంది ఉండాలి. ప్రస్తుతం ఒక్కరు కూడా విధుల్లో లేకపోవడం గమనార్హం. ఆ బాధ్యతలను జేఈలే చూడాల్సి రావడంతో ఏ డిస్ట్రిబ్యూటరీ కింద ఎంత నీరు విడుదలవుతుందో అర్థం కాని పరిస్థితి. అవసరాలకు అనుగుణంగా రాత్రిళ్లు పైభాగంలోని తూములను రైతులు కొందరు ఇష్టారీతిన పైకి లేపేస్తుండడంతో దిగువకు నీరు చేరడం కష్టంగా మారుతోంది. దీన్ని గుర్తించిన అధికారులు గతంలో పనిచేసి పదవీ విరమణ పొందిన వారు, ఇతర ప్రైవేటు వ్యక్తులను ఒకరిద్దర్ని లస్కర్లుగా నియమించుకున్నారు. వారితోనే సర్దుబాటు చేయాల్సిన దుస్థితి నెలకొంది. నీటి విడుదలపై ఉన్న శ్రద్ధ లస్కర్ల నియమించడంలో ప్రభుత్వానికి లేదంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తగినంత సిబ్బందిని నియమించకపోతే వేసవిలో నీటి తడులు సక్రమంగా అందించడం కష్టమని రైతులు బావిస్తున్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందించాలి



చివరి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరందించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ఎర్రంపల్లి వద్ద నున్న 16 డిస్ట్రిబ్యూటరీకి ఐదేళ్ల తర్వాత నీరొచ్చింది. చివరి భాగాన ఉండడంతో సాగునీరు చేరడం కొంత కష్టంగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో లస్కర్లు లేకపోతే మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. నీటి విడుదల్లో లస్కర్ల ప్రాముఖ్యత ఎంతో ఉంటుంది. నియమకానికి చర్యలు చేపట్టాలి.

– శివాయదవ్, రైతు ఎర్రంపల్లి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



ప్రాజెక్ట్ పరిధిలో లస్కర్ల కొరత తీవ్రంగా ఉంది. 17 పోస్టులుండగా అన్నీ ఖాళీగా ఉన్నాయి. వీరి అవసరాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. జిల్లాలో దాదాపు అన్ని ప్రాజెక్టుల పరిధిలోనూ వీరి కొరత ఉంది. దీంతో డిప్యూటేషన్ పై నియమించుకునేందుకు ఇబ్బందులు ఉన్నాయి. పదవి విరమణ పొందిన వారిని తాత్కలికంగా నియమించుకునేలా చర్యలు చేపట్టాం. రైతులకు ఇబ్బందుల్లేకుండా సాగునీరందిస్తాం.

– బలరాముడు, మైనర్ ఇరిగేషన్ డీఈ, రాయదుర్గం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో భంభం బాబా గ్రామోత్సవం



భంభం బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కుందుర్పి: మండలంలోని తెనగల్లు, అప్పిలేపల్లి, మహంతపురం, కుందుర్పి గ్రామాల్లో మంగళవారం సద్గురు భంభంబాబా గ్రామోత్సవాన్ని ఆయా గ్రామాల భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గడిచిన 21 రోజులు కఠోర దీక్ష చేపట్టిన భక్తులు మంగళవారం విరమించారు. స్వామి వారి చిత్రపటాలను ట్రాక్టర్లపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టి దీక్ష విరమణ చేశారు.

వాలీబాల్ పోటీల విజేతగా ఉరవకొండ జట్టు



ఉరవకొండ జట్టుకు కప్ అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఆమిద్యాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా యువకులకు జనతా అగ్రి సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈనెల 14న ప్రారంభమైన పోటీల్లో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉరవకొండ–విడపనకల్లు జట్ల మధ్య హోరాహోరీగా జరిగింది. ఇందులో 15–13, 15–13 తేడాతో ఉరవకొండ జట్టు విడపనకల్లుపై ఘన విజయం సాధించింది. విజేత జట్టుకు అగ్రి సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులు కప్, నగదు అందజేశారు.

గోశాల నిర్వాహణకు ఆర్థిక సాయమందించండి

కూడేరు: ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రం సమీపాన ఏర్పాటు చేసిన గోశాల నిర్వాహణకు దాతలు ఆర్థిక సాయమందించాలని నిర్వాహకుడు ప్రవీణ్ స్వామి బుధవారం కోరారు. భక్తులు తమ మొక్కుగా ఆవులను సంగమేశ్వరుడికి కానుకగా వదిలారన్నారు. అలా వదిలిన ఆవులు వాటి సంతతి కలిపి సుమారు 100 వరకు ఉన్నాయన్నారు. ముగ్గురు వ్యక్తులకు వేతనాలు ఇస్తూ వాటిని గోశాలలో ఉంచి సంరక్షిస్తున్నామని ఆయన తెలిపారు. ఆవులకు గ్రాసం, సంరక్షకులకు జీతాలు ఇవ్వడానికి ఇబ్బందిగా ఉందన్నారు. దాతలు, భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

తిమ్మరాయుడుకు సన్మానం



తిమ్మరాయుడును సన్మానిస్తున్న జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, నాయకులు

కంబదూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ములకనూరు తిమ్మరాయుడును జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, యువజన నేత భీమేష్, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా కార్యదర్శి విల్సన్ ఘనంగా సన్మానించారు. తిమ్మరాయుడు భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ఐపార్సుపల్లి వెంకటేశులు, హరీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కుందుర్పి: కర్ణాటకలోని లింగనపల్లి నుంచి కుందుర్పి మీదుగా ఎనుములదొడ్డికి తరలిస్తున్న 155 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ నగేష్ తెలిపారు. నిందితులు ఎనుములదొడ్డి విశ్వనాథ్, శెట్టూరు మండలం ఎర్రబోరేపల్లికి చెందిన మహేష్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

తూముకుంటలో కనకదాస జయంతి



కనకదాస చిత్రపటాన్ని ఊరేగిస్తున్న కురుబలు

కుందుర్పి: తూముకుంట గ్రామంలో బుధవారం కనకదాస జయంతి వేడుకలను కురుబ కులస్తులు ఘనంగా నిర్వహించారు. కనదాసు చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. మహిళలు బోనాలతో వెళ్లి పూజలు చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కనకదాస జీవిత చరిత్రను పలువురు వక్తలు వివరించారు.కార్యక్రమంలో కురుబ సంఘం మండల నాయకులు కేపీ గోపాల్, రమేష్, సర్పంచులు రామాంజినేయులు, వరలక్ష్మీ, గంగాధర, బీకే లక్ష్మణమూర్తి, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే విశ్వను కలిసిన రాకెట్ల నేతలు



మాజీ ఎమ్మెల్యే విశ్వ, యువనేతను ప్రణయ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాకెట్ల గ్రామ నాయకులు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ రాకెట్ల గ్రామ నాయకులు బుధవారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ రాయలసీమ జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డిని కలిసి సంక్రాంతి శుభకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వ రాకెట్ల గ్రామ నాయకులతో సమావేశమై పార్టీ బలోపేతం పై చర్చించారు. ఈసందర్భంగా పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్త, నాయకుడికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తులూరు అశోక్, సర్పంచ్ దెయ్యాల నాగరాజు, ఆమిద్యాల సర్పంచ్ శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్‌లు శీనప్ప, పెన్నయ్య, నాయకులు రామప్ప, శీను పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహం



విద్యార్థులకు జ్ఞాపికలు అందించిన నిర్వాహకులు

బెళుగుప్ప: నక్కలపల్లిలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో వారం రోజులుగా కొనసాగిన పోతన భాగవత సప్తాహ కార్యక్రమం బుధవారం ముగిసింది. మంగళవారం బెళుగుప్ప శ్రీనివాస విద్యానికేతన్ విద్యార్థులు కరస్పాండెంట్ శ్రీనివాసులు, హెచ్ఎం సుమల పర్యవేక్షణలో రుక్మిణీకళ్యాణం, శమంతకోపాఖ్యానం, నరకాసుర వధ పద్య సంపుటిలను స్థానికులతో కలసి ఆలపించి తాత్పర్యాలను వివరించారు. నిర్వాహకులు శ్రీనివాస విద్యానికేతన్ బృందానికి జ్ఞాపికలను అందజేసి కరస్పాండెంట్, హెచ్ఎం, ఉపాధ్యాయులను దుశ్శాలువాలు పూలమాలలతో సన్మానించారు. బుధవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు పెద్దలు, బెళుగుప్ప విశ్రాంత ఉపాధ్యాయుడు ఈశ్వరప్ప తదితరులు నిర్వాహకులు నారాయణరెడ్డితో కలసి కుచేలోపాఖ్యానం, బాణాసుర ఘట్టం పద్యాలతో భాగవత పఠనం చేశారు. అనంతరం నిర్వాహకులు ముఖ్య అతిథులను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు.

వనవాసం వీడి నివాసాల్లోకి..



గ్రామ దేవతలతో ఊరేగింపుగా వస్తున్న ప్రజలు



గ్రామ పొలిమేర నుంచి పిల్ల పాపలతో ఊర్లోకి వస్తున్న స్థానికులు

కుందుర్పి: గ్రామ శాంతి కోసం సోమవారం సాయంత్రం 4 గంటలకు ఊరొదిలిన శ్రీమజ్జనపల్లి గ్రామస్తులు మంగళవారం సాయంత్రం 4 గంటలకు దేవుళ్లతో సహా ఇళ్లలోకి చేరుకున్నారు. ఐదేళ్లకోసారి ఇలా గ్రామం నలుమూలా ముళ్లకంచే వేసి మూగజీవాలు, పిల్లపాపలతో సహా 24 గంటలకు సరిపడా ఆహారంతో ఊరొదలడం వందేళ్ల కాలంగా జరుగుతోందని గ్రామస్తులు తెలిపారు. 24 గంటల పాటు గ్రామ పొలిమేరలో వంటావార్పుతో రాత్రికి అక్కడే నిద్రించి మంగళవారం ఆరుబయటే స్నానాలు ఆచరించిన పిదప గ్రామం చుట్టూ ఉన్న కంచెను తొలగించి ఇళ్లకు చేరుకున్నారు. ఈసందర్భంగా గ్రామదేవతలను ఊరేగించారు.

ఘనంగా కొల్లాపురమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, నేత ఉమామహేశ్వరనాయుడు

శెట్టూరు: మండలంలోని చింతర్లపల్లిలో కొల్లాపురమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. మూడో రోజు బుధవారం జాతరకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నాయకులు ఉమామహేశ్వర నాయుడు, జెడ్పీటీసీ మంజునాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి కొల్లాపురమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని, పాడిపశువులు వృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరియన్న, బాబురావు, మీసేవ బాబు, ప్రదీప్, గోవిందు, విశ్వనాథ, రామాంజినేయులు, గొల్ల తిప్పేస్వామి, మల్లయ్య, చిన్న, శివన్న, ఎమ్మెస్ రాయుడు, రామకృష్ణ, శెట్టూరు తిప్పేస్వామి, గొర్ల గంగాధర, వీరాంజినేయులు, వీరభద్రప్ప, సుధాకర్, టైలర్ వన్నూరుస్వామి, తంజిల్, మల్లేష్, పార్టీ అనుబంధ నాయకులు విజయ్‌కుమార్, గిరి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గుమ్మఘట్ట: నిరుద్యోగయువతి, యువకులకు సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. బీసీలకు బీసీ కార్పొరేషన్ ద్వారా, కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రహ్మణ, క్షత్రియలకు ఈబీసీలకు ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడి రుణాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ నెల 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎస్ఎస్ ట్యాంకుకు ముమ్మరంగా పంపింగ్



ఎస్ఎస్ ట్యాంకులోకి తుంగభద్ర జలాల పంపింగ్ జరుగుతున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ శాశ్వత తాగునీటి పథకం కింద కణేకల్లులోని సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుకు నిరంతరాయంగా తుంగభద్ర జలాల పంపింగ్ కొనసాగుతోంది. గత నవంబర్ రెండోవారంలోనే ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయికి చేరుకుని నీరు పుష్కలంగా ఉన్నాయి. నేటికీ హెచ్చెల్సీ ద్వారా ఎస్ఎస్ ట్యాంకులోకి నీటి పంపింగ్ జరుగుతోంది. పట్టణంలో 32 వార్డులకుగాను 70 వేలకుపైగా జనాభా ఉంది. 2050 నాటికి జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని అప్పటి ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.52 కోట్లతో హెచ్చెల్సీ మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసి శాశ్వతంగా నీటి సమస్యకు పరిష్కారం చూపారు. ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయి నీటిమట్టం 3052 మిలియన్ లీటర్లు కాగా ప్రస్తుతం రెండు రోజులకోసారి 9.5 ఎంఎల్‌డీ ప్రకారం పట్టణానికి నీటిని సరఫరా చేస్తున్నారు. అదే నిష్పత్తిలో ట్యాంకు పూర్తిస్థాయి సామర్థ్యం ఏమాత్రం తగ్గకుండా హెచ్చెల్సీ నుంచి ఎస్ఎస్ ట్యాంకులోకి నీటిని పంపింగ్ జరుగుతోంది. హెచ్చెల్సీకి ఫిబ్రవరి నెలాఖరు వరకు నీటి ప్రవాహం కొనసాగే అవకాశం ఉండగా అప్పటి దాకా ఎస్ఎస్ ట్యాంకుకు నీటి పంపింగ్ జరుగుతూనే ఉంటుందని కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. మరో ఆరేడు నెలల దాకా ఎలాంటి తాగునీటి ఇబ్బందులు ఉండవన్నారు. లీకేజీలతో నీరు వృథా కాకుండా దశల వారిగా లీకేజీలను సరి చేస్తామని చెప్పారు.

ప్రజల పక్షాన పోరాడుదాం



మాజీ ఎమ్మెల్యే మెట్టును సన్మానిస్తున్న మారెంపల్లి మారెన్న

బొమ్మనహాళ్: ప్రజల పక్షాన కూటమి ప్రభుత్వంపై పోరాడదామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు పయ్యావుల సత్యన్న స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం సూపర్‌సిక్స్‌తో పాటు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేస్తున్న తీరును గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గద్దెనెక్కాక ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల జీవితాలకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త, సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు ఎంసీహెచ్ రాజ్‌కుమార్, పయ్యావుల సత్యన్న, కేశవరెడ్డి, పరమేశ్వర, కోటేశ్వరరెడ్డి, డాక్టర్ బసప్ప, సూర్యప్రతాప్‌రెడ్డి, ఆంజినేయులు, వెంకటేశులు, ఫోటో బసవరాజు, వన్నూరుస్వామి, మురళి తదితరులు పాల్గొన్నారు.

మాపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

కణేకల్లు: అధిష్టానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న పేర్కొన్నారు. బుధవారం ఆయన రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డిని కలిసి ఆయన్ను శాల్వ కప్పి పూలమాల వేసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ బ్రహ్మానందరెడ్డి, మారెంపల్లి మారెన్న, హళ్లి నాగరాజు, మారెంపల్లి రామన్న, వేమన, డి.శ్రీనివాసులు, వెంకటేశులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు



కూడేరు: రాతిదూలం లాగుతున్న వృషభాలు

కూడేరు: జల్లిపల్లిలో బుధవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో రాతి దూలం లాగుడు పోటీలు పోటాపోటీగా జరిగాయి. తోపుదర్తికి చెందిన చెన్నప్పకు చెందిన వృషభాలు మొదటి విజేతగా నిలిచి రూ.30 వేలు నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి. కర్ణాటక రాష్ట్రం ఆంధ్రోల్‌కు చెందిన ఆనంద్ రెడ్డి వృషభాలు రూ.ద్వితీయస్థానంలో నిలిచి రూ.20 వేలు, అనంతపురం పట్టణం ప్రియాంకనగర్‌కు చెందిన ఓబుళపతి ఆచారి వృషభాలు తృతీయం స్థానంలో నిలిచి రూ.10 వేలు నగదును సొంతం చేసుకున్నాయి. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం



కూడేరు: అలంకరణలో జల్లిపల్లి చౌడేశ్వరీ దేవి

కూడేరు: జల్లిపల్లిలో మంగళవారం గ్రామదేవత చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. తొలుత చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెనాలికి చెందిన వారు ఐదు వేషధారణలతో శివతాండవ ప్రదర్శన నిర్వహించారు. తర్వాత మంగళవాయిద్యాల నడుమ ఉరవకొండకు చెందిన వారు గ్రామ పురవీధుల్లో చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

20 నుంచి చౌడేశ్వరీదేవి ఉత్సవాలు..

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నేసేపేటలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శిరుమాళ్ల కృష్ణమూర్తి, మద్దిలేటి ప్రభాకర్ తెలిపారు. తొలిరోజు తెల్లవారుజామున 5 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 21న మంగళవారం తెల్లవారు జామున ఆలయం వద్ద నుంచి నవ జ్యోతుల ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. 22న బుధవారం రాత్రి నెలపూజతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈసారి మొట్టమొదటిసారిగా పంచమజ్యోతుల స్థానంలో నవ(9) జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చౌడేశ్వరీ దేవి ఉత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

క్రీడలతో ఐకమత్యం



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: క్రీడలతోనే ఐకమత్యం సాధ్యమని ఉద్దేహాళ్ యూత్ సభ్యులు విజయ్, విశ్వనాథ్‌రెడ్డి, రవి, హర్ష, తిప్పేష్ పేర్కొన్నారు.ఉద్దేహాళ్ గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకొని మూడు రోజులుగా క్రికెట్ పోటీలు జరిగాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయ్ జట్టు విజయం సాధించింది. విజయ్ జట్టుకు ట్రోఫీ, రన్నర్స్ సునీల్ జట్టుకు ట్రోఫీని యూత్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో చైతన్యం తీసుకురావడానికే ఏటా గ్రామంలో సంక్రాంతి రోజున క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు కుళ్లాయప్ప, సురేష్, రఘు, మారుతి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా పొట్టేళ్ల పోటీలు

గుమ్మఘట్ట: సిరిగెదొడ్డిలో పొట్టేళ్ల పోటీలు మంగళవారం రసవత్తరంగా సాగాయి.హిందూముస్లీం యువజన సంఘం ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. కర్ణాటకలోని చెళ్లికెరకు చెందిన చంద్ర పొట్టేలుపై రాయదుర్గం పట్టణానికి చెందిన ప్రకాష్ పొట్టేలు విజయం సాధించింది. పొట్టేలు యజమానికి నిర్వాహకులు బహుమతి అందజేశారు.

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని టీసర్కిల్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. అనంతపురానికి చెందిన మెడికల్ రెప్ శివ విధి నిర్వహణలో భాగంగా బుధవారం పట్టణంలోని టీసర్కిల్ వద్దకు చేరుకున్నారు. రోడ్డుపై వెళ్తుండగా రాయదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి శివ ఢీకొట్టింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని అనంతపురం తీసుకెళ్లారు.

ముంగిళ్లలో మెరిసిన రంగవల్లులు



వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి సంక్రాంతి పండుగలో పాల్గొన్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: రాయదుర్గం నియోజకవర్గంలో సంక్రాంతి సందర్భంగా మహిళలు రంగవల్లులతో లోగిళ్లను అందంగా తీర్చిదిద్దారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి తన నివాసం వద్ద రైతులతో కలసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని వీధుల్లో ఇళ్ల ముందు మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానించారు. పండుగ సందర్భంగా పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

కంబదూరు: మండలంలో సంక్రాంతి వేడుకలు మంగళవారం ఇంటింటా జరిగాయి. ఉదయమే మహిళలు ఇళ్ల వద్ద రంగు రంగుల ముగ్గులను వేసి పిండి వంటను చేసుకొని ఇంటిల్లి పాది ఆనందంగా గడిపారు. అలాగే ఆయా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉరవకొండ: తెలుగింటి సంప్రదాయల పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇంటి ఆవరణలో రంగు రంగుల ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రంగువల్లుల నడుమ గొబ్బెమ్మలు ఉంచి అందంగా తీర్చిదిద్దారు. నగరాల నుంచి సొంత గ్రామాలకు వచ్చిన విద్యార్థిని, యువతులు అందమైన ముగ్గులు పోసేందులో పోటీపడ్డారు.

భక్తులతో పోటెత్తిన ఆలయాలు..

కూడేరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం ముద్దలాపురం, జల్లిపల్లి, కరుట్లపల్లిలోని రామాలయాలు, కూడేరులో జోడులింగాల సంగమేశ్వర స్వామి, బసాపురం ఆంజనేయ స్వామి ఆలయాలు, అంతరగంగ, కలగళ్ల, కడదరకుంట, ముద్దలాపురంలోని ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆయా ఆలయాల అర్చకులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్గించారు. భక్తిశ్రద్ధలతో ప్రజలు ఆయా ఆలయాల దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సంక్రాంతి పండుగను సంప్రదాయ పద్ధతిలో ప్రజలు జరుపుకున్నారు.

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మూడు రోజుల పాటు సంక్రాంతి పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి పండుగకు స్వాగతం పలికారు. పట్టణాల నుంచి అనేక మంది స్వగ్రామాలకు చేరుకోవడంతో పల్లెలు సందడిగా మారాయి. స్థానిక జనార్ధనవేంకటేశ్వరస్వామి,షిర్డీ సాయి ఆలయం, నగరేశ్వరస్వామి, రామేశ్వర స్వామి, మారెమ్మ,సుంకులమ్మ లక్ష్మీనారాయణ స్వామి తదితర ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. జరుట్లరాంపురంలోని జరుట్లరామలింగేశ్వర స్వామి, కొనకొండ్లలోని ఛాయామల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.



రాయదుర్గంలోని ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు

కణేకల్లు: మండలంలో సంక్రాంతి పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ప్రతి ఇంటా రంగురంగుల ముగ్గులు వెలిశాయి. ముగ్గుల మధ్యలో సంప్రదాయబద్ధంగా గొబ్బెమ్మలను పెట్టి మహిళలు పూజలు నిర్వహించారు. రైతులు కల్లాల్లో వరిధాన్యం రాసులకు పూజలు జరిపించారు. స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి, స్వయంబేశ్వరస్వామి ఆలయాల్లో ప్రజలు పూజలు నిర్వహించారు.

బెళుగుప్ప: మండలవ్యాప్తంగా మకర సంక్రాంతి సందర్భంగా ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలను పూలతో పూజలు చేపట్టారు. విఘ్నేశ్వరాలయంలో అయ్యప్ప మాలాధారులు అయ్యప్పస్వామి పడిపూజ చేపట్టి అన్నదానం నిర్వహించారు.



ఉరవకొండలో ముగ్గులు వేస్తున్న మహిళలు

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా కళ్లాపి చల్లిన ముంగిళ్లలో రంగవల్లులపై గొబ్బెమ్మలు పెట్టి అందులో వనధాన్యాలు పోసి పూజలు చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు గాలిపటాలను, ఎగురవేస్తూ సందడి చేశారు. వివిధ గ్రామాల్లో యువత కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ వంటి పోటీలు నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం కనుమ సందర్భంగా రైతులు తమ ఇళ్లలోని గోవులను శుభ్రంగా కడిగి పసుపు, కుంకుమ బొట్లతో కొమ్ములను అలకరించి పూజలు చేశారు.